క్లుప్తంగా

ఆస్పత్రి ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ఆదోని టౌన్ : పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సాయి కంటి నూతన ఆస్పత్రిని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ డాక్టర్ కృష్ణగోపాల్ ప్రారంభించారు. కంటి వైద్యనిపుణులు వై.ఎం.కృష్ణమూర్తి అత్యాధునిక వసతులతో కంటి ఆస్పత్రిని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు.

రంజాన్ పండగను భక్తి శ్రద్ధలతో జరుపుకోండి



పేద ముస్లింలకు నిత్యావసర కిట్లను పంపిణీ చేస్తున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

ఆదోని టౌన్ : ముస్లింల పవిత్రమైన పండగ రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం రాంజల రోడ్డులోని ఎంబీఏ ఫంక్షన్ హాలులో అల్ ఖైర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాదాపు 200 మంది పేద ముస్లింలకు బియ్యం, చక్కెర, వంటనూనె, కందిపప్పు, గోధుమపిండి తదితర నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ నియాజ్‌అహ్మద్, ఫౌండేషన్ నిర్వాహకులు షేర్‌ఖా ఇస్మాయిల్, యాకూబ్‌పటేల్, ఇషాక్‌పటేల్, అబ్దుల్‌బాషీద్ పాల్గొన్నారు.

వెండి ఆభరణాల విరాళం



ఆభరణాల అలంకరణలో ఉలిగమ్మ అమ్మవారు

మద్దికెర: స్థానిక వడ్డె వీధిలో ఉన్న ఉలిగమ్మ అమ్మవారికి కాలువ నాగరాజు, లక్ష్మి దంపతులు 30 తులాల వెండితో తయారుచేసిన ఆభరణాలను బుధవారం ఆలయ నిర్వాహకులు వడ్డె శ్రీనివాసులుకు అందజేశారు. అనంతరం అమ్మవారిని ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించి దాతలకు ప్రసాదం పంపిణీ చేశారు.

1 నుంచి కబడ్డీ పోటీలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో శ్రీరామ నవమి జాతర పురస్కరించుకొని వైఎస్సార్ యూత్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు ఈరన్న, బీసుపల్లి, రవి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, గ్రామ నాయకులు సిబి. జానకిరామిరెడ్డి, డి.సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పోటీలు జరగనున్నట్లు చెప్పారు. గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.20 వేలు, రెండవ బహుమతి రూ.10 వేలు అందచేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల జట్లు రూ.600 ఎంట్రీ ఫీజు చెల్లించి ఈ నెల 31వ తేదీలోపు జట్టు పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. వివరాలకు 91821 48165, 82472 30953, ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

పంచలోహ కవచం విరాళం

ఆస్పరి: ఆస్పరిలో వెలసిన ఆంజనేయస్వామికి కర్నూలుకు చెందిన యోగేశ్వరరావు, ఆస్పరికి చెందిన దాసప్పగారి అంజినయ్య అనే భక్తులు రూ.65 వేలు విలువ చేసే పంచలోహ కవచం విరాళంగా అందించారు. ఈసందర్భంగా ఆలయంలో పూజారి నిరంజన్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

30న రాష్ట్రస్థాయి భజన పోటీలు

కృష్ణగిరి: మండల పరిధిలోని పెనుమాడ గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఈ నెల 30న రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. 30న రాత్రి 9 గంటలకు భక్తి భజన పోటీలు ఉంటాయని, పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ.20 వేలు, రూ.18 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ. 8 వేలు, రూ.7 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ. 3 వేలు, రూ. 2 వేలు, రూ. వెయ్యి నగదు బహుమతులను దాతల సహకారంతో అందించనున్నట్లు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే వారు అదే రోజు సాయంత్రం 6 గంటల్లోపు రూ.300 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 97014 47250, 96664 55417 నంబర్లను సంప్రదించాలని కోరారు.

హోరాహోరీగా పొట్టేళ్ల పందెం

నందవరం: జొహరాపురం గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకుని గ్రామంలో మారెమ్మవ్వ దేవర నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టేళ్ల పోటీలు ఏర్పాటు చేశారు.

ఘనంగా ఉగాది సంబరాలు

- సుంకలమ్మవ్వ, మారెమ్మ ఆలయాల్లో భక్తుల సందడి
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు

ఆదోని అర్బన్ : ఉగాది పండగ సందర్భంగా బుధవారం పట్టణంలోని అమ్మవారి దేవాలయాలకు భక్తులు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఇళ్లల్లో పిండి వంటలు చేసుకుని నైవేద్యంతో ఆయా కాలనీల్లో వెలిసిన సుంకులమ్మ, మారెమ్మ ఆలయాలకు వెళ్లి నైవేద్యం సమర్పించారు. ఈ మేరకు చిన్న మార్కెట్‌లో ఉన్న సుంకులమ్మవ్వదేవి, ఇస్వీ రోడ్డులోని మారెమ్మవ్వ దేవి, కొత్త బస్టాండు రోడ్డులోని సుంకులమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూలో వేచి ఉండి నైవేద్యం సమర్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉగాది పండగ సందర్భంగా పట్టణంలోని మంగరాయ కాలనీలో వెలిసిన మంగరాయ ఆంజనేయ స్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మేనేజర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో పంచాంగం పుస్తకాలకు పూజలు చేశారు. ముందుగా స్వామివారిని ఫల, పంచామృతాభిషేకం, తేనె అఊభిషేకం, నైవేద్యం, ప్రత్యేకంగా కనకాంబరాల పూల అలంకరణ, మహామంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే.. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మిగనూరు రోడ్డులోని వేణుగోపాల స్వామి ఆలయంలో ఉగాది పండగ సందర్భంగా ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.ముందుగా వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సంఘం మాజీ రాష్ట్ర కార్యద ర్శి బాల కొండప్ప, జాతీయ సహాయ కార్యదర్శి రాజశేఖర్ రావు, సభ్యులు ఎం.పి.శ్రీనివాసులు, తాయప్ప, రామకృష్ణరావు పచ్చడి పంపిణీ చేశారు.

ఆదోనిటౌన్ : పట్టణంలోని కార్వన్‌పేటలో కొలువుదీరిన సుంకులమ్మను బుధవారం ఉగాదిని పురస్కరించుకుని భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు.



పూజలందుకున్న ఇస్వీరోడ్డులోని మారెమ్మవ్వ



సుంకులమ్మ దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు



భక్తుల మధ్య సాగుతున్న ఆంజనేయస్వామి రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో సుంకులమ్మ



ప్రత్యేక అలంకరణలో మంగరాయ ఆంజనేయస్వామి

లక్ష్మవ్వ రథోత్సవం

మంత్రాలయం రూరల్: మండలంలోని బూదూరు, చిలకలడోణ గ్రామాల్లో ఉగాది పండుగ సందర్భంగా నిర్వహించిన రథోత్సవాలు రమణీయంగా సాగాయి. బూదూరులో గ్రామ దేవత లక్ష్మవ్వకు గ్రామస్తులు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పుర వీధుల్లో భక్తజనం మధ్య రథోత్సవం నిర్వహించారు. అలాగే చిలకలడోణలో ఉగాదిని పురస్కరించుకుని గ్రామస్తులందరూ మంత్రాలయం సమీపంలోని తుంగభద్ర నదికి చేరుకుని గంగమ్మకు ప్రత్యేక పూజలు చేపట్టి తుంగా జలాలను తీసుకెళ్లి గ్రామంలోని ఆంజనేయ స్వామిని అభిషేకించారు. సాయంత్రం గ్రామంలో రథోత్సవం చేపట్టారు. వేడుకను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

● వేడుకగా..ఓరుగట్టు ఆంజనేయ స్వామి ప్రభోత్సవం



భక్తుల మధ్య ఊరేగిస్తున్న స్వామి వారి ప్రభోత్సవం

కోసిగి: మండలంలోని దుద్ది గ్రామంలో వెలసిన ఓరుగట్టు ఆంజనేయ స్వామి వారి ప్రభోత్సవం బుధవారం సాయంత్రం భక్తుల జయ జయ ధ్వానాల మధ్య రమణీయంగా సాగింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు మహాదేవప్ప, బసవరాజు తాత ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువ జామున నుంచి జలాభిషేకం, ఫల,పుష్పాలంకరణలు గావించి మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంకాలం మేళతాళాలు, కలశాలు, వందలాది మంది భక్తుల మధ్య స్వామి వారి ప్రభను పాదాల చెంత వరకు లాగి తిరిగి యథాస్థానం చేర్చారు.

● ఘనంగా శ్రీ కృష్ణావదూత స్వామి ప్రభోత్సవం

మండలంలోని వందగల్లు గ్రామ ప్రజల ఆరాధ్య దైవం శ్రీ కృష్ణావదూత స్వాముల మహా ప్రభోత్సవం బుధవారం సాయంత్రం వేలాది మంది భక్తుల మధ్య కనుల పండువగా సాగింది. ఉగా ది పర్వదినంను పురస్కరించుకుని వేకువ జామున నుంచి ఆర్లబండ అంబ భవానీ ఆలయ పీఠాధిపతులు శ్రీ మఠిస్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకు పూజ, వెండి కవచ అలంకరణ గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు కలశాలతో, పూర్ణకుంభం, మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయం చెంతకు చేరుకున్నారు. స్వామి వారికి పూజలుచేసి పీఠాధిపతులు మఠిస్వామిలకు 127వ తులభారం (నాణెలతో) చేపట్టారు. అనంతరం పీఠాధిపతులను మహా ప్రభోత్సవంపై ఆశీనులు గావించి రథోత్సవం చేపట్టారు.

మండల కేంద్రంలో ఉగాది పండుగ పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం కోసిగిలో కడపాళెం వీధిలో వెలసిన కాళికాదేవి ఆలయంలో వేకువ జామున నుంచి ఆలయ అర్చకులు గోపాలాచారి స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు చేపట్టారు. సాయంత్రం భక్తులు ఆలయం నుంచి అమ్మవారి రథోత్సవం పురవీధుల్లో సాగింది.





వందగల్లులో భక్తుల మధ్య స్వామి వారి ప్రభోత్సవం, కోసిగిలో కాళికాదేవి రథోత్సవ దృశ్యం

ఘనంగా లక్ష్మమ్మవ్వ రథోత్సవం

కౌతాళం: ఉగాది పర్వదినం సందర్భంగా మండలంలోని లక్ష్మినగర్ క్యాంపులో వెలసిన లక్ష్మమ్మవ్వదేవి రథోత్సవం అశేష జనవాహిన మధ్య రమణీయంగా బుధవారం సాయంత్రం సాగింది. తెల్లవారు జామున ప్రత్యేక పూజలు సుప్రభాత సేవ, మహామంగళహారతి వంటి పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి అనుమతించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టూ పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు.



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో కలశ ప్రతిష్ఠ

కోసిగి: మండల కేంద్రంలో కురుబ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీ బీరప్ప స్వామి ఆలయ గోపుర కలశ స్థాపన బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం ఉదయం ఆలయంలో అర్చకులు పూజారి మల్లయ్య స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి జలాభిషేకం, రుద్రాభిషేకం, ఆకుపూజ, మహామంగళ హారతులు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తుల సహకారంతో ఆలయ గోపుర, ముఖద్వార గోపురం కలశాలను ఊరేగింపుగా ఆలయం చెంతకు చేర్చి ప్రత్యేక పూజల అనంతరం గోపురంపై ప్రతిష్ఠించారు.



గోపుర కలశాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

● ఘనంగా లక్ష్మీనారాయణస్వామి రథోత్సవం

ఆదోని రూరల్ : మండలంలోని హాన్వాల్ గ్రామంలో బుధవారం సాయంత్రం లక్ష్మీనారాయణస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో పంచామృతాభిషేకం, జలాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర విశేష పూజలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం రథానికి పూజలు చేసి రథాన్ని భక్తుల జయజయ ధ్వానాల మధ్య ముందుకు లాగారు. తాలూకా ఎస్‌ఐ గోపాల్‌రెడ్డి, పెద్దతుంబళం ఏఎస్‌ఐ రమణ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



రథాన్ని లాగుతున్న భక్తులు

● ఘనంగా అమ్మవారి పల్లకోత్సవం



ఆదోని అర్బన్ : పట్టణంలోని కిలిచినపేటలో వెలిసిన శ్రీ అంబాభవానీ ఆలయంలో ఉగాది పండగ సందర్భంగా బుధవారం పల్లకోత్సవం కార్యక్రమం చేపట్టారు. ఉదయం నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భాజా భజంత్రీలు, డోలు, సన్నాయిల మధ్య పురవీధుల్లో పల్లకోత్సవం చేపట్టారు.

● ఘనంగా శ్రీ ఆంజనేయస్వామి రథోత్సవం

పెద్దకడబూరు : ఉగాది పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి రథోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. భక్తులు పిండివంటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం సుందరంగా ముస్తాబు చేసిన రథంపై ఆంజనేయ ఉత్సవ మూర్తిని అధిష్ఠింపేజేసి ఆలయం నుంచి ఆదోని రహదారిలో వెలసిన సీతారాం లక్ష్మన్న ఆలయం వరకు లాగి యదాస్థానానికి చేర్చారు. నూతనంగా తయారు చేసిన రథం కావడంతో గ్రామస్తులు తమ ఆడపడుచులకు ఒడిబియ్యం పోసి సంబరాలు చేసుకున్నారు.



ఆశేష భక్తుల మధ్య రథంపై ఊరేగుతున్న ఆంజనేయస్వామి

హోరాహోరీగా ఎద్దుల పోటీలు

చిప్పగిరి: ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని దేగులహాలు గ్రామంలో బుధవారం ఎంపీపీ జూటూరు హేమలత, సర్పంచ్ నీలకంఠ ఆధ్వర్యంలో ఎద్దులబండ్ల పోటీలు నిర్వహించారు. మొత్తం 24 జతల ఎద్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో సల్లాపురం బాలయ్య చెందిన ఎద్దులు నిర్ణీత 1.50 కి.మీ దూరాన్ని 2.19 నిమిషాలలో చేరుకుని విజేతగా నిలిచాయి. నాగేంద్ర ఎద్దులు 2.21 నిమిషాలలో, యర్రగుడి సురేష్, రఘుకు చెందిన ఎద్దులు సంయుక్తంగా 2.22 నిమిషాలలో గమ్యం చేరుకుని తరువాతి స్థానాల్లో నిలిచాయి. విజేత వృషభాల యజమానులకు రూ.20 వేలు నగదు, 20 తులాల వెండి, రెండో బహుమతి రూ.15వేలు, 15 తులాల వెండి, మూడో బహుమతి రూ.10 వేలు, 10 తులాల వెండి అందజేశారు. దాతలు మారయ్య, గోవిందరాజులు, తిమ్మయ్య నగదు బహుమతులు అందించగా, వెండి బహుమతులను దాతలు సతీష్, ప్రతాప్, చంద్ర అందించారు. నిర్వాహకులు లాల్‌స్వామి లింగన్న, రైతులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

పాఠశాల నిర్మాణానికి స్థలం విరాళం



పాఠశాల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం,



స్థల దాత కాల్వ లక్ష్మయ్య

కోసిగి: మండలంలోని వందగల్లు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణానికి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కాల్వ లక్ష్మయ్య తన కున్న పొలంలో 30 సెంట్ల స్థలం విరాళంగా అందజేశాడు. బుధవారం తెలుగు సంవత్సరం ఉగాది పర్వదినం పురస్కరించుకుని పార్టీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకటరెడ్డి సమక్షంలో విరాళంగా ఇచ్చిన స్థలంలో పాఠశాల నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రెండవ విడుత నాడు–నేడు కింద 17 గదులు నిర్మాణానికి రూ.2.60 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అయితే నిధులు ఉన్నా పాఠశాల నిర్మాణానికి గ్రామంలో ప్రభుత్వ స్థలం లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. తమ గ్రామ పిల్లల బంగారు భవిష్యత్ కోసం కాల్వ లక్ష్మయ్య గ్రామ శివారులో తన పొలం సర్వే నంబర్ 331లో 3.50 ఎకరాల భూమిలో 30 సెంట్లు భూమిని పాఠశాల పేరు మీదుగా రిజిస్ట్రేషన్ చేసి ఉపాధ్యాయులకు పత్రాలు అందజేశారు. గ్రామస్తులు విద్యార్థులు, ఉపాధ్యాయులు దాతకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నాటక చరిత్రలో మరపురాని ఘట్టం



పంచాంగ శ్రవణానికి హాజరైన ప్రజలు



కమలపాలిక నాటక కళాకారులను సన్మానిస్తున్న బి.వి.రెడ్డి, పుల్లయ్య

కర్నూలు కల్చరల్: జిల్లా నాటక చరిత్రలో ఒక పద్య నాటకం ఏడు బహుమతులు అందుకోవడం మరుపురాని ఘట్టమని పారిశ్రామిక వేత్త బ్రమ్మర్షి బి.వి.రెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య అన్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడలో జరిగిన జాతీయ స్థాయి పద్యనాటక పోటీల్లో టీజీవీ కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన శ్రీకృష్ణ కమలపాలిక పద్యనాటకం ప్రథమ బహుమతితో పాటు ఆరు వ్యక్తిగత బహుమతులు కైవసం చేసుకుంది. ఉత్తమ నాటకంగా ఎన్నికైన శ్రీకృష్ణ కమలపాలిక నటులకు, ఉత్తమ నటుడు శ్రీకృష్ణ పాత్రధారి జి.శ్రీనివాసరెడ్డి, ఉత్తమ నటి కమలపాలిక పాత్రధారి సురభి ప్రభావతి, ఉత్తమ హాస్యనటుడు చిట్టిదొర పాత్రధారి సంగా ఆంజనేయులు, ఉత్తమ హాస్య నటి సింగారి పాత్రధారి హసీనా, ఉత్తమ సంగీతం హార్మోనిస్టు బి.బలరాముడు, ఉత్తమ దర్శకులు పత్తి ఓబులయ్యను ఉగాది సంబరాల వేడుకల్లో ఘనంగా సత్కరించారు. అంతకుముందు కృష్ణ బృందం నాదస్వర కచ్చేరీతో ఉగాది సంబరాలు ప్రారంభమయ్యాయి. వేద పండితుడు భానుస్వామి పంచాంగ శ్రవణం, కవులు ఇనాయతుల్లా, డాక్టర్ గుండం పాటి విజయసారధి, డాక్టర్ వి.పోతన, కళ్యాణదుర్గం స్వర్ణలత, కెంగార మోహన్‌లచే నిర్వహించిన కవి సమ్మేళనం ఆకర్షణగా నిలిచింది. పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియా, సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరంగనాథుడికి పల్లకీ సేవ



పల్లకీలో ఊరేగుతున్న స్వామివారు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథుడిని బుధవారం పల్లకీలో ఉంచి ఊరేగింపు చేశారు. ఉగాది పండుగను పురస్కరించుకొని దేవాలయంలో ఉదయం స్వామి వారికి బిందెసేవ అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని అలంకరణ చేసి అష్టోత్తరనామార్చన, అభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించి ఆలయ ప్రదక్షిణలు చేశారు. సాయంత్రం స్వామి వారిని సతీసమేతంగా గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.